# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-09-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిర్వహించే ఈస్టుకోస్ట్ మేరిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.**
2. **తెలంగాణలో వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం అంచనాల నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
3. **బహిరంగ మార్కెట్ లో ఉల్లి ధరలు తగ్గడంతో ప్రభుత్వం ఉల్లి కొనుగోలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య శాఖ మంత్రి టిజి భరత్ తెలిపారు.**
4. **తెలంగాణాలో ఈనెల 21 వ తేదీ నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.**
5. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యున్నతికి కృషిచేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తారు. తూర్పుతీరంలో నౌకా వాణిజ్య విస్తరణ, ఇతర అంశాలపై నగరంలోని ఒక ప్రైవేటు హోటల్లో జరగనున్న ఈస్టుకోస్ట్ మేరిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ఆయన పాల్గొననున్నారు. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సులో దేశంలోని తూర్పు తీరంలో కార్గో రవాణాను పెంచడం, పోర్టుల సామర్థ్యాన్ని పెంచేందుకు మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై చర్చిస్తారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

--------------------------

తెలంగాణలో వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం అంచనా వేసి వెంటనే నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో వర్షాలు, వరద సహాయంపై జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో దృశ్య మాధ్యమం ద్వారా గత సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు 5 లక్షలపరిహారం ఇవ్వాలని సూచించారు. విపత్తు నిర్వహణ నిధులతో చేపట్టిన పనుల వివరాలతో నివేదిక ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాల సమయంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో చెరువుల పరిస్థితిపైన సమగ్ర

అధ్యయనం చేయాలని తెలిపారు. విపత్తు నిర్వహణ బృందాలు వరదల సమయంలో సమర్థవంతంగా విధులు నిర్వహించాయని ముఖ్యమంత్రి అభినందించారు.

---------------------------

రాష్ట్రంలో పంట సాగుకు అవసరమైన ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఎరువుల సరఫరా, విజిలెన్స్ బృందాల దాడులపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎరువులకు కొరత సృష్టించే వారిపై, బ్లంది పెట్టే దుకాణాల డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ నిల్వలు గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యున్నతికి కృషిచేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో గత సాయంత్రం జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రితో పాల్గొన్న శాసనసభ్యులు పలు అంశాలను ప్రస్తావించారు. సమావేశం అనంతరం, మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధరలు తగ్గడంతో ప్రభుత్వం ఉల్లి కొనుగోలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య శాఖ మంత్రి టిజి భరత్ తెలిపారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో మార్క్ ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలును మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరలు పడిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉండేందుకు ఉల్లి పంట కొనుగోలు ప్రారంభించిందని తెలిపారు. రైతులు గ్రేడింగ్ చేసి ఉల్లిని మార్కెట్‌కు తీసుకుని రావాలని కోరారు. కర్నూలులో కొనుగోలు చేసిన ఉల్లిని రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తామని మంత్రి వెల్లడించారు.

---------------------------

తెలంగాణాలో ఈనెల 21వ తేదీ నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈనెల 21న వేయిస్తంభాల గుడిలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. గిన్నిస్ బుక్ రికార్డ్స్ సాధించే లక్ష్యంతో ఈనెల 29న హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..28 సెకన్లు

---------------------------

సెప్టెంబర్ 10వ తేదీన అనంతపురంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో ఎన్డీయే కూటమి మహా సభను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురంలో సభ

కార్యక్రమం కార్యాచరణ ప్రణాళికపై ఉమ్మడి అనంతపురం జిల్లా కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

వాయిస్...28 సెకన్లు

---------------------------

మానవుని దైనందిన జీవితంలో అనేక రకాలుగా ఉపయోగించే కొబ్బరి పట్ల అవగాహన కల్పించేందుకు ఈ రోజు ప్రపంచ కొబ్బరి దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఆసియా పసిఫిక్ కోకోనట్ కమ్యూనిటీ 2009వ సంవత్సరం సెప్టెంబరు రెండవ తేదీన మొదటిసారి కొబ్బరి దినోత్సవం జరుపుకున్నట్టు ప్రకటించింది. అప్పటి నుండి ప్రతి ఏటా ఇదే రోజున కొబ్బరి దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రకృతి మనకు ప్రసాదించిన ఎన్నో అపార సంపదలలో కొబ్బరి ఒకటి. పూజ ... ఆహారం..., ఇంధనం..., ఔషధం ...., సౌందర్య సాధనాలు..., నిర్మాణ వస్తువులు ....ఇలా అనేక విధాలుగా ఉపయోగ పడే కొబ్బరి చెట్టును "కల్ప వృక్షం" గా పిలుస్తారు. కొబ్బరిని ఎగుమతి చేస్తున్న అగ్ర దేశాలలో భారత దేశం కూడా వుండడం విశేషం.

---------------------------

ఉత్తర బంగాళాఖాతంలో ఈరోజు అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..22 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ అల్పపీడన ప్రభావంతో ఉత్తర తెలంగాణా జిల్లాలో ఈరోజు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.

---------------------------

బీహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా జరుగుతున్న ఆసియా కప్ హాకీ టోర్నీలో భాగంగా నిన్న జరిగిన మ్యాచ్‌లో భారత హాకీ జట్టు కజికిస్తాన్ జట్టుపై 15-0 తేడాతో విజయం సాధించింది. దీంతో గ్రూప్-ఎలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత జట్టు సూపర్ 4కి చేరుకుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 7వ తేదీన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు పరీక్షలు నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి పి. రాజాబాబు తెలిపారు. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రాజాబాబు మాట్లాడుతూ, పరీక్షల ఫలితాలు నెలాఖరుకు విడుదల చేస్తామని తెలిపారు. ఓఎమ్మార్ షీట్‌ను అభ్యర్థులు ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా నింపాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 1600 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ వివిధ నోటిఫికేషన్లు ఇచ్చిందని ఈ నెలాఖరుకు మరో 16 పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్లు ఇవ్వనున్నామని వెల్లడించారు.

=====================